సాక్షి కామారెడ్డి

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



ఎన్నికలు బహిష్కరిస్తాం

తాగునీటి సమస్య పరిష్కరించకపోతే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని బిచ్కుందవాసులు హెచ్చరించారు.

- 8లో ▸



దొంగల ముఠా అరెస్ట్

ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగలు, ఆయిల్ చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.2 /22.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని రాజీవ్ పార్క్ పక్కన గల సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు కార్యక్రమం కొనసాగనుంది. ఈ విషయాన్ని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డీఈ కళ్యాణ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి పట్టణ, మండల వినియోగదారులతో పాటు, తాడ్వాయి మండల వినియోగదారులు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పీహెచ్‌సీల వైద్యులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంనుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీహెచ్‌సీల వైద్యాధికారులతో మాట్లాడారు. వ్యాధులు ప్రబలుతున్న ఏరియాల్లో ఆంటీ లార్వా పిచికారి చేయడం, ఫాగింగ్ చేయడం, నీరు నిల్వ ఉండేచోట ఆయిల్ బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, రక్తపరీక్షలు చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశించారు.

మెట్లబావి అభివృద్ధి పనుల పరిశీలన



లింగంపేట: మండల కేంద్రంలోని నాగన్న గారి మెట్ల బావి పునరుద్ధరణ పనులను మంగళవారం రెయిన్ వాటర్ ప్రాజెక్టు వ్యవస్థాపకురాలు కల్పనా రమేశ్ పరిశీలించారు. పనులు వేగంగా జరుగుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి గిరిజనులతో మాట్లాడి వారి ఆచార వ్యవహారాలు, స్త్రీలు ధరించే దుస్తుల తయారీ విధానం గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారి సురేందర్, ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కబ్జాకోరులు.. దేన్నీ వదలరు

- జిల్లాకేంద్రంలో నాలాల ఆక్రమణ
- వానొస్తే వాగులను తలపిస్తున్న రోడ్లు
- పెద్దచెరువు వరద కాలువనూ చెరబట్టిన వైనం
- అలుగు పారినపుడల్లా నీట మునుగుతున్న కాలనీలు
- ఆక్రమణదారులకు నేతల అండదండలు
- 'హైడ్రా' తరహా చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు

కబ్జాకోరులు దేన్నీ వదలడం లేదు. జిల్లాకేంద్రంలో నాలాలన్నింటినీ ఆక్రమించడంతో వానొస్తే రోడ్లు వాగుల్లా మారుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతోనే ఆక్రమణలు జరిగాయన్న విమర్శలున్నాయి. 'హైడ్రా' తరహాలో చర్యలు చేపడితేనే పరిస్థితి మెరుగుపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నిజాంసాగర్ రోడ్డులో నాలాలు కబ్జా కావడంతో రోడ్డుపై నిలిచిన వరద నీరు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్ : వరదలతో రోడ్లు మునిగి, ఇళ్లల్లోకి నీరు చేరినపుడల్లా కబ్జాల వ్యవహారం తెరపైకి వస్తోంది. కబ్జాదారులకు కొందరు రాజకీయ నాయకులు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వారి అండతోనే ఆక్రమణదారులు తెగబడి ఎక్కడికక్కడ కబ్జాలకు పాల్పడ్డారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కామారెడ్డి పట్టణం చుట్టూరా గతంలో చెరువులు, కుంటలు ఉండేవి. అయితే అభివృద్ధి పేరుతో జరిగిన విధ్వంసం మూలంగా చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయి. కొన్ని కుంటలు ఉనికి లేకుండాపోయాయి. రుక్మిణీకుంట, బతుకమ్మకుంట, పీతిరికుంట, తెట్టెకుంట.. ఇవేవీ ఇప్పుడు కనపించవు. కానీ వాటి పేరుతో కాలనీలు మాత్రం ఉన్నాయి. కామారెడ్డి పెద్ద చెరువు శిఖం కూడా కబ్జాలకు గురవుతోంది. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ ఏరియాల్లో ఇష్టారీతిన నిర్మాణాలు సాగుతున్నాయి.

ఉనికి కోల్పోయిన నాలాలు...

వాన దంచికొట్టినపుడల్లా పట్టణంలోని కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్, ఆర్యనగర్, జన్మభూమిరోడ్డు, నిజాంసాగర్ రోడ్డు ప్రాంతాలన్నీ చెరవులను తలపిస్తున్నాయి. పట్టణంలో ఖరీదైన ప్రాంతంగా పేరున్న విద్యానగర్ ముంపు సమస్యను ఎదుర్కొంటోంది. దీనికి కారణం వర్షపు నీరు వెళ్లే నాళాలు కబ్జా కావడమేననేది బహిరంగ రహస్యం. డిగ్రీ కాలేజీ వైపు నుంచి వచ్చే వర్షపు నీరంతా కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్ కాలనీల మీదుగా ఉన్న నాలా ద్వారా కామారెడ్డి పెద్ద చెరువులోకి వెళ్తుంది. అయితే ఈ ప్రాంతంలో కబ్జాలతో నాలాల ఆనవాళ్లు కూడా లేకుండాపోయాయి. నిజాంసాగర్ రోడ్డులో కొంత కనబడుతున్నా అదీ కబ్జా అయ్యింది. నాలాలు కబ్జా కావడంతో చెరువులోకి వెళ్లాల్సిన నీరు రోడ్లపైనే నిలిచిపోతోంది. తద్వారా నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బస్టాండ్ ప్రాంతం నుంచి వచ్చే వచ్చే డ్రెయినేజీని నిజాంసాగర్ చౌరస్తా, హైదరాబాద్ రోడ్డు మీదుగా వరద కాలువలోకి వదలాల్సి ఉన్నా.. రాజకీయ నాయకుల భవనాలకు నష్టం కలగొద్దని 'దారి' మళ్లించారు. దీంతో కొత్తబస్టాండ్ వైపు నుంచి వచ్చే వరద కూడా నిజాంసాగర్ రోడ్డులోకి వెళ్లి నిలిచిపోతోంది. దీంతో వర్షం కురిస్తే నిజాంసాగర్ రోడ్డు చెరువును తలపిస్తోంది. అశోక్‌నగర్ కాలనీ, రుక్మిణికుంట, బతుకమ్మకుంట, పంచముఖి హనుమాన్ కాలనీ, గాంధీనగర్, టీచర్స్ కాలనీ, అయ్యప్పనగర్ తదితర ప్రాంతాల్లో నాలాలు ఆక్రమణలకు గురవడంతో వర్షపు నీరంతా రోడ్లపై నిలిచిపోయి ఇళ్లలోకి చేరుతోంది. సిరిసిల్ల రోడ్డులో డ్రెయినేజీని ఇష్టారీతిన కట్టడంతో వరద నీరు వెళ్లలేక రోడ్డుమీదే నిండిపోతోంది.

పెద్దచెరువు వరద కాలువ..

పట్టణంలోని పెద్దచెరువు అలుగు ద్వారా పారే నీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన కాలువ కుచించుకుపోయింది. అలుగు నుంచి మొదలుకుని కామారెడ్డి వాగుదాకా కాలువ కబ్జాకు గురైంది. కాలువకు ఇరువైపులా మట్టిని నింపి పూడ్చివేసి నిర్మాణాలు సాగించారు. దీంతో కాలువ రూపం కోల్పోయి అలుగు పారినపుడల్లా సమీపంలోని జీఆర్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీలు జలమయమవుతున్నాయి. ముఖ్యంగా జీఆర్ కాలనీలో వరదనీరు చేరడంతో ఇళ్లల్లో ఉన్నవారందరినీ తరలించాల్సి వచ్చింది.

సీఎం ప్రకటనతో..

హైదరాబాద్ మహానగరంలో ఆక్రమణలపై 'హైడ్రా' కొరడా ఝుళిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా తరహా వ్యవస్థను తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన స్థానికుల్లో ఆశలు పెంచింది. జిల్లాల వారీగా ఆక్రమణలు, కబ్జాల వివరాలు సేకరించాలని సీఎం ఆదేశించడంతో అధికారులు వాటి లెక్కలు ఏ మేరకు తీస్తారన్న దానిపై చర్చ నడుస్తోంది.

ఇప్పటికైనా అధికార యంత్రాంగం చెరువులు, కాలువలు, నాలాల కబ్జాల వ్యవహారాన్ని బయటపెట్టి, ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హౌజింగ్ బోర్డు కాలనీలో కాలువను ఆనుకొని చేపట్టిన నిర్మాణాలు



జీఆర్ కాలనీలోకి వచ్చిన పెద్దచెరువు అలుగు నీరు



జీఆర్ కాలనీలో ఇంటిలోకి వచ్చిన వరద నీరు



డబుల్ బెడ్‌రూం ఇళ్ల చుట్టూ చేరిన నీరు

ముంపు పాపం ఎవరిది?

- శిఖంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం
- భారీ వర్షాలతో జలదిగ్బంధం
- ఏటా ఇదే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పథకాన్ని తీసుకువచ్చింది. జిల్లాలో చాలా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటికే చాలా చోట్ల పేదలు నివాసం ఉంటున్నారు. అయితే భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో బొబ్బిలి చెరువు శిఖంలో ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో ఏటా ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తోంది చెరువు శిఖంలో 30 ఇళ్లు నిర్మించారు. చెరువు నిండినప్పుడల్లా డబుల్ బెడ్ రూం ఇళ్ల చుట్టూ నీరు చేరడం పరిపాటిగా మారింది. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో చెరువు నిండి ఇళ్ల చుట్టూ నీరు చేరింది. దీంతో అధికారులు వాటిలో నివసిస్తున్నవారిని పునరావాస కేంద్రానికి తరలించారు.

చర్యలు తీసుకునేనా?

జాతీయ రహదారి పక్కనే ఈ నిర్మాణాలున్నాయి. ఆ మార్గంలో వెళ్లేవారు ఈ ఇళ్లను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. చెరువు శిఖంలో ఇళ్లు నిర్మించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శిఖంలో ఇళ్లు నిర్మించి ప్రజాధనాన్ని నీళ్లపాలు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇంటికి పగుళ్లు వచ్చిన దృశ్యం



కూలిన గోడలు

క్షణాల్లో నేలమట్టం

- చూస్తుండగానే కూలిన ఇంటి గోడలు
- ఎవరూ లేకపోవడంతో తప్పిన ముప్పు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : చూస్తుండగానే ఓ ఇళ్లు నేలమట్టమైంది. లింగంపేట మండలం భవానీపేటలో మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఇది జరిగింది. ఈ దృశ్యాన్ని ఓ యువకుడు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. వివరాలిలా ఉన్నాయి. లింగంపేట మండలం భవానీపేటలో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ వైర్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది నరికివేస్తున్నారు. దీనిని ఓ యువకుడు వీడియో తీస్తుండగా.. సమీపంలోని ఇంటి గోడ పడిపోతున్న చప్పుడు వచ్చింది. దీంతో కెమెరాను అటువైపు తిప్పాడు. క్షణాల్లో ఇంటిలో ఓ భాగం పడిపోయింది. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. సదరు యువకుడు ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి, సత్తయ్య కుటుంబం అందులో నివసిస్తోంది. హైదరాబాద్‌లో ఉన్న పిల్లల వద్దకు వారు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

నిజాంసాగర్ ప్రాజెక్టుకు జలకళ

- మూడు రోజుల్లో 8 టీఎంసీల రాక
- 13.513 టీఎంసీలకు చేరిన నీటిమట్టం

నిజాంసాగర్: మొన్నటి వరకు బోసిపోయిన నిజాంసాగర్ ప్రాజెక్టు.. ప్రస్తుతం జలకళను సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టు నీటిమట్టం 13.513 టీఎంసీలకు చేరింది.


ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులో వర్షాకాలం ప్రారంభంలో మూడు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అడపాదడపా కురిసిన వర్షాలతో మూడు రోజుల క్రితం వరకు 1.9 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అయితే నాలుగు రోజులనుంచి కురుస్తున్న వర్షాలతో ఎగువనుంచి భారీ వరద వస్తోంది. దీంతో మూడు రోజుల్లో ఎనిమిది టీఎంసీలకుపైగా ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా మంగళవారం రాత్రి 9 గంటల వరకు 1,401.86 అడుగుల(13.513 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువనుంచి 36,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోందని పేర్కొన్నారు.

పోచారంలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి మంగళవారం 6,659 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో అంతే నీరు అలుగుపై నుంచి దిగువకు ప్రవహిస్తోంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం



అలుగు పారుతున్న పోచారం ప్రాజెక్టు

శాంతించిన వరుణుడు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వరుణుడు శాంతించాడు. జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. మూడు నాలుగు రోజులుగా దంచికొడుతున్న వానలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. జనం చాలా వరకు ఇళ్లకే పరిమితం కావలసి వచ్చింది. అయితే మంగళవారం వరుణుడు శాంతించడంతో తిరిగి ఎవరి పనులలో వారు నిమగ్నమయ్యారు. మంగళవారం అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షాలతో వరదలు ప్రవహించి చాలా చోట్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వాన తగ్గడంతో వరదలు కూడా తగ్గుముఖం పట్టాయి. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

నిండుగా చెరువులు..

జిల్లాలో మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మూడు రోజుల క్రితం వరకు డెడ్ స్టోరేజీకి చేరువలో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 13 టీఎంసీలకు చేరింది. జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాలా ప్రాజెక్టు కూడా నిండుతోంది. సింగితం రిజర్వాయర్‌తోపాటు కల్యాణి, పోచారం ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో 1,515 చెరువులు ఉండగా 1450 వరకు చెరువులు నిండాయి. మిగతా చెరువులు నిండేందుకు రెడీగా ఉన్నాయి. భారీ వర్షాలతో చాలాచోట్ల పంటలు నీటమునిగాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పొలాలనుంచి నీరు బయటికి వెళ్లిపోతోంది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నష్టం వివరాలు సమర్పించండి

- వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: భారీ వర్షాల వల్ల జిల్లాలో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం వివరాలను అందజేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. వర్షాలు, వరదల కారణంగా చనిపోయిన వారి వివరాలు, దెబ్బతిన్న ఇండ్ల వివరాలను అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పాఠశాలల భవనాలు దెబ్బతింటే వివరాలను నమోదు చేయాలన్నారు. మరమ్మతులు జరిగే పాఠశాలలకు సెలవు ప్రకటించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అంతటా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

కామారెడ్డి క్రైం: వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 8 అంగుళాల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై విద్యా సంస్థల్లో క్విజ్ కార్యక్రమాలు నిర్వహించడం, చేతి వృత్తుల వారికి మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముంపు ప్రాంతంలో ఇళ్లు నిర్మించారు

- ప్రజల జీవితాలతో ఆడుకున్నారు
- గత పాలకులపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ధ్వజం
- రామేశ్వర్‌పల్లిలో ముంపు బాధితులకు పరామర్శ

భిక్కనూరు: గత పాలకులు చెరువు ముంపు ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. మంగళవారం ఆయన భిక్కనూరు మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలో వరదతో దెబ్బతిన్న శ్రీసిద్ధరామేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేదారిని పరిశీలించారు. అనంతరం రామేశ్వర్‌పల్లిలోని పునరావాస కేంద్రంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల యజమానులతో మాట్లాడారు. షబ్బీర్‌అలీ ఫౌండేషన్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 2 వేల చొప్పున అందించారు. పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామేశ్వర్‌పల్లి నీటమునిగిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివసిస్తున్న 17 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. వరద తగ్గేంతవరకు తాత్కాలిక వసతి కల్పించే విషయమై కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న భిక్కనూరు మండల కేంద్రం నుంచి శ్రీసిద్ధరామేశ్వరాలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.63 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఈ రోడ్డు తాత్కాలిక మరమ్మతులకోసం పంచాయతీ రాజ్ శాఖ నిధుల ద్వారా రూ. 5 లక్షలు మంజూరు చేయించానన్నారు. జాతీయ రహదారి నుంచి శ్రీసిద్ధరామేశ్వరాలయానికి వెళ్లే సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా తారు వేయాలని నేషనల్ హైవే అధికారులను కోరానన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు కుంట లింగారెడ్డి, బల్యాల సుదర్శన్, మద్ది సూర్యం, లింబాద్రి, మైపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాజయ్య, ధర్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గంగ్ల భూమయ్య తదితరులున్నారు.



రామేశ్వర్‌పల్లిలో బాధితులతో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

బాధితులను ఆదుకుంటాం



టీచర్స్ కాలనీలో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: భారీ వర్షాల వల్ల నష్టపోయినవారిని ఆదుకుంటామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీ, బతుకమ్మకుంట, రుక్మిణికుంట, హౌజింగ్ బోర్డు, బీఆర్‌కాలనీలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. వరదల్లో చనిపోయిన పశువులు, జీవాలకు సైతం పరిహారం ఇసుందన్నారు. వరద నష్టంపై కేంద్రానికి నివేదిక పంపామని, జాతీయ విపత్తుగా పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు, పండ్ల రాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాధులపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు వైద్యురాలు హిమబిందు జ్వరం, డయేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. భారీ వర్షాల వల్ల నీరు కలుషితమై డయేరియా, వాతావరణంలో మార్పులతో వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేశ్, చంద్రకళ, ఫరీదాబేగం, యాదగిరి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారికి సన్మానం



కామారెడ్డి టౌన్ : ఇటీవల ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి పొందిన గజవాడ హన్మంత్ రావును కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సన్మానించారు. శాలువాలు, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, నాయకులు కాళ్ల గణేష్, తేజపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన యువకులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనంపై పేరుకు పోయిన చెత్తను అదే కాలనీకి చెందిన యువకులు తొలగించారు. భవనంపై చెత్త నిండడం వల్ల భారీగా వర్షపు నీరు పేరుకుపోవడంతో గదుల్లోకి నీరు చేరింది. ఇట్టి విషయాన్ని జీపీ అధికారులకు విన్నవించినా అది మా పరిధిలో ఉండదని పేర్కొన్నారని యువకులు తెలిపారు. స్వచ్ఛందంగా యువకులే నడుం బిగించి భవనంపై పేరుకు పోయిన నీటిని తొలగించారు.



అలుగు పారుతున్న జక్షిజాన్కంపల్లి ఊరచెరువు



నెమ్లిగుట్ట తండాలో పొలంలో చేరిన ఇసుక



కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లే దారిలో ధ్వంసమైన రోడ్డు

తెరిపినిచ్చిన వాన

జిల్లాలో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షం మంగళవారం తెరిపినిచ్చింది. చాలాచోట్ల తెగిన రోడ్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. అలుగులు ఉధృతంగా పారుతున్నాయి. మంగళవారం కూడా వర్షం మోస్తరుగా కురిసింది. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండొద్దని అధికారులు పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు అధికారులు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తాండూర్ శివారులో అలుగు పారుతున్న బ్రాహ్మణకుంట



టీచర్స్ కాలనీలో కూలిన మురికికాలువ సైడ్‌వాల్



సదాశివనగర్‌లో ధ్వంసమైన తిర్మన్‌పల్లి తండా రోడ్డు



భవానీపేటలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



పోచారం గ్రామం వద్ద కొట్టుకుపోయిన వంతెన



సింగీతం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న ఈఈ సోలోమాన్



తాడ్వాయి శివారులో కొట్టుకు పోయిన వరి

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంతో సిబ్బందితో సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు తడిసిన విద్యుత్ స్తంభాలను చేతులతో ముట్టుకోకూడదని, విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను కూడా తాకరాదన్నారు. అంతేకాకుండా రైతులు విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలినట్లయితే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడినప్పుడు విద్యుత్ స్విచ్‌లు ఆఫ్ చేసి ఉంచాలని తెలిపారు. ఆయనతో పాటు ఏడీఈ కిరణ్‌చైతన్య, ఏఈ దివ్య గాయత్రి, సబ్ ఇంజినీర్ నాగరాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



బీబీపేటలో విద్యుత్ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

వయోవృద్ధులకు వైద్య శిబిరం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని జీపీలో మంగళవారం డివిజన్ పంచాయతీ అధికారి సురేందర్, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ సహకారంతో వయోవృద్ధులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యురాలు విజయ(యునాని), పీహెచ్‌సీ వైద్యురాలు హిమబిందు 100 మంది వృద్ధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తాం

- ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన



బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రశాంత్ కాలనీలో తాగునీరు రావడం లేదని, రాబోయే పంచాయతీ ఎన్నికలను తాము బహిష్కరిస్తామని మంగళవారం కాలని ప్రజలు జీపీకి ఖాళీ బిందెలతో వచ్చి నిరసన తెలిపారు. మిషన్ భగీరథ తాగునీరు ఏడాది నుంచి రావట్లేదని కాలనీలో కనీసం సింగిల్ ఫేస్ బోర్లు మోటారు లేకపోవడంతో తాగడానికి, వాడుకోవడానికి నీళ్లు లేవన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నో సార్లు విన్నవించుకున్నా కాలనీవాసుల నీటి సమస్యలు పరిష్కరిండం లేదని ఆరోపించారు. ఖాళీ బిందెలతో గంటపాటు నిరసన తెలిపారు. 15 వార్డులో కుక్కలు మనుషులపై దాడిచేస్తున్నాయని కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

మోడల్ వసతిగృహంలో బాలికలకు నీటికష్టాలు

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట ఆదర్శ మోడల్ వసతి గృహ బాలికలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో మోడల్ వసతి గృహ బాలికలు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సదరు వసతి గృహం నందు 100 మంది బాలికలు హాస్టల్‌లో ఉంటున్నారు. మోడల్ పాఠశాల ఆవరణలో ఉన్న వసతి గృహానికి బోరు మోటార్ నీటి సరఫరా నిలిపి వేశారు. దీంతో బాలికలు స్నానాలకు ఇతరత్రా అవసరాలకు నీటికొరత ఏర్పడింది. వసతి గృహ బాలికల నీటి కష్టాలను వార్డెన్ సరోజన స్థానిక ఎంపీడీవో గంగాధర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళకు వివరించినా బోరు ద్వారా నీటిని సరఫరా చేయడలం లేదని తెలుస్తోంది. బాలికల అవసరాల కోసం ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



వాగును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

మద్నూర్(జుక్కల్) : కురుస్తున్న భారీ వర్షాలకు గోజేగాం వద్ద ప్రవహిస్తున్న లెండి వాగును మంగళవారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు, వంతెన పరిస్థితి, రాకపోకలను తహసీల్దార్ ముజీబ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వరద తగ్గిందని తహసీల్దార్ సూచించారు. పంటనష్టంపై విచారించారు. ఎంపీడీవో రాణి, ఆర్ఐ పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : నాటిన మొక్కలను సంరక్షించి, అవి చెట్లుగా తయారయ్యేవరకు బతికించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి మండల కేంద్రంలోని రోడ్డుప్రక్కన వన మోహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో మల్లేష్, కార్యదర్శి బాలు తదితరులున్నారు.

అటెండర్ మానవత్వం..

- పునరావాస కేంద్రంలోని బాధితులకు అన్నదానం చేసిన లింగం
- అభినందించిన గ్రామస్తులు



బాధితులకు అన్నదానం చేస్తున్న లింగం

రామారెడ్డి : ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రం రామారెడ్డిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీళ్లు చేరడంతో బాధితులను రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించి సేవలందిస్తున్నారు. మంగళవారం పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న సుమారు 70 మందికి రామారెడ్డి జూనియర్ కాలేజీలో అటెండర్‌గా పనిచేస్తున్న లింగం అనే వ్యక్తి మంగళవారం భోజనం పెట్టి మానవత్వాన్ని చాటుకున్నాడు. లింగంకు నెలజీతం రూ. 1500 అయినప్పటికీ నాలుగునెలలుగా జమచేసిన డబ్బులను పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నటువంటి బాధితులకు భోజనం పెట్టేందుకు వినియోగించాడు. ఆపదలో ఉన్నవారిని సాయం చేయాలనే ఆలోచనతోనే తన నాన్నెళ్ల జీతంను బాధితులకు భోజనానికి వినియోగించినట్లు లింగం పేర్కొన్నారు. లింగంను రామారెడ్డి గ్రామస్తులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక

కామారెడ్డి టౌన్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి 27 మంది ఎంపికయ్యారని డీఈవో రాజు తెలిపారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో వీరికి అవార్డులు అందిస్తామని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు..

కే.సాయిరెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్, చిన్నమల్లారెడ్డి), కాళీదాస్(జెడ్పీహెచ్‌ఎస్, గిద్ద), శివశంకర్(జెడ్పీహెచ్‌ఎస్, చద్మల్‌తండా) శ్యాంకుమార్(జెడ్పీహెచ్‌ఎస్, గర్గుల్), లింగం(భూంపల్లి), వెంకట కన్నన్(జెడ్పీహెచ్‌ఎస్, కామారెడ్డి), గంగాధర్(లింగంపేట్), వెంకటరమణ (గండిమాసానిపేట), అనిల్‌కుమార్ (రెడ్డిపేట తండా), భవాని(జెడ్పీహెచ్‌ఎస్, దేవునిపల్లి), పీఆర్‌కే.మూర్తి(దేమికలాన్), సంతోష్‌కుమార్(అచ్చంపేట), సరిత(భిక్కనూరు), వనిత(తలమడ్ల), లక్ష్మి(చుక్కాపూర్), కృష్ణాకర్‌రావు(ధర్మారావుపేట), రమేశ్‌కుమార్(ఎల్లారెడ్డి), లక్ష్మీనారాయణ(సుల్తాన్‌పేట), నాగరాజు (పోతంగల్‌కలాన్), శ్రీనివాస్‌రావు(ఎంపీపీఎస్, పోలీస్‌లైన్), భాగ్యలక్ష్మి(ఇసాయిపేట), భవాని(గాంధారి), రజని (సర్వాపూర్), ప్రకాశ్(మద్దికుంట), నర్సింలు(నెహ్రూనగర్), దామోదర్‌రావు(ఐలాపూర్), భాస్కర్‌గౌడ్(బజ్జపల్లి).

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కోసం జిల్లానుంచి ముగ్గురు ఉపాధ్యాయుల పేర్లను ప్రతిపాదించినట్లు డీఈవో తెలిపారు. ప్రవీణ్(జెడ్పీహెచ్‌ఎస్, కాటేపల్లి), స్వర్ణలత (జెడ్పీహెచ్‌ఎస్, పల్వంచ), రామకృష్ణ(జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్, చిన్నమల్లారెడ్డి) పేర్లను పంపామన్నారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

రామారెడ్డి : రానున్న గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రామారెడ్డి ఎస్సై నరేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శాంతి కమిటీ సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మా గౌడ్, మాజీ సర్పంచు సంజీవ్,గడ్డం ప్రసాద్, న్యామతుల్లా, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జాలరి మృతదేహం లభ్యం



మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన జాలరి కైరంకొండ శివరాములు(55) రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి మానేరు ప్రాజెక్టులో గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం అదే ప్రాజెక్టులో శవమై తేలినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్

- కేసు నమోదు చేసిన పోలీసులు, ఒక రోజు జైలు

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఓ వ్యక్తి పోలీసులను తప్పుదోవ పట్టించడంతో ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు రెండో టౌన్ ఎస్సై యాసిన్ అరాఫత్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బాబన్ సహాబ్‌పహాడ్ కాలనీకి చెందిన నదీం ఆర్‌ఆర్ చౌరస్తా ప్రాంతంలో నడుచుకుంటు వెళ్తుండగా అనవసరంగా డయల్ 100కు ఫోన్ చేశాడు. పోలీసులు వెంటనే సదరు వ్యక్తి నంబర్‌ను ట్రేస్ చేసి అతని వద్దకు వెళ్లగా సమస్య ఏమీ లేదని కావాలనే ఫోన్ చేసినట్లు మద్యం మత్తులో తెలిపాడు. దీంతో పోలీసులను తప్పుదోవ పట్టించడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అతనికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిరికొండ ఎఫ్ఆర్వో సస్పెన్షన్

సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ అధికారి(ఎఫ్ఆర్వో) ఎంవీ నాయక్‌ను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ అటవీ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రావుట్ల సెక్షన్ పరిధిలో అటవీ భూమిని కబ్జా చేసిన వ్యవహారంలో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఆయనను సస్పెన్షన్ చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదే ఘటనలో రావుట్ల సెక్షన్ అధికారి వసంత్‌రావు ఇది వరకే సస్పెన్షకు గురయ్యారు.

రెండు వైన్ షాపుల్లో చోరీ



లింగంపేట: మండల కేంద్రంలోని ఎంఎస్‌జీ వైన్స్, రాజావైన్ షాపుల్లో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రోజు వారిగా నిర్వాహకులు వైన్ షాపులకు రాత్రి పది గంటలకు తాళాలు వేసి వెళ్లిపోయారు.ఉదయం వైన్స్ పరిసరాలను శుభ్రం చేసే వ్యక్తి చూడగా దుకాణాల తాళాల పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి యజమానులకు సమాచారం అందించాడు. దీంతో వారు వచ్చి చూడగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. చోరీలో 12 ఫుల్‌బాటిళ్ల మద్యం, రూ. 15వేల నగదు చోరీ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఫుల్‌బాటిళ్ల విలువ రూ. 25వేలు ఉంటుందన్నారు. నిర్వాహకులు శిరీష్‌గౌడ్, బుజ్జాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం



లింగంపేట: మండలంలోని ఎక్కపల్లి సంగ్యానాయక్ తండాకు చెందిన నేనావత్ సర్దార్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆగస్టు 31న ఇంటి నుంచి వెళ్లిన సర్దార్ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ

- ఒకరి మృతి



షారుఖ్ ఖాన్ మృతదేహం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. హర్యానా నుంచి జహీరాబాద్‌కు వెళ్తున్న ఓ లారీ కామారెడ్డికి సమీపంలోని జాతీయ రహదారిపై నేషనల్ దాబా దగ్గరకు రాగానే రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన మరో లారీని వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో లారీ నడుపుతున్న రాజస్థాన్‌కు చెందిన షారుఖ్ ఖాన్(22) అక్కడికక్కడే మృతి చెందగా పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. రోడ్డుపై ఎలాంటి సూచికలు లేకుండా లారీని నిలిపిన వ్యక్తిని తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లా తిరునగర్‌కు చెందిన రాజపండిగా గుర్తించారు. షారుఖ్ ఖాన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి బంధువు అక్బర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ రూరల్/ నిజాంసాగర్: ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగితీగలను దొంగిలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజాంసాగర్ పీఎస్ పరిధిలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద ఎస్సై సుధాకర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మెదక్ జిల్లాకు చెందిన ఉబిడి లింగమయ్య అలియాస్ నాని, చిత్తారి రమేశ్, తురపాటి ఏసు, దాసరి రాజు, తురపాటి అంబయ్యలను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వీరి నుంచి 59 ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన రూ. 6 లక్షల విలువ చేసే ఆరు క్వింటాళ్ల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని 8 పోలీస్‌స్టేషన్లలో 35 కేసులు ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకున్న బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్, నిజాంసాగర్ ఎస్సై సుధాకర్, హెడ్‌కానిస్టేబుల్ సతీశ్, కానిస్టేబుళ్లు వసీ, శ్యామ్, రఘు, సంగమేశ్వర్, రాజు, బాలాజీలను కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ అభినందించినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

చెరువు కబ్జా చేసి విక్రయించిన కేసులో..

ఖలీల్‌వాడి: చెరువు ప్రాంతాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఐదోటౌన్ ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. నగరంలోని ఐదో టౌన్ పీఎస్ పరిధిలోని భారతీనగర్ ప్రాంతంలో ఉన్న బొందెం చెరువును కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న నరేశ్, అబ్దుల్ మహమ్మద్, గోపాల్, కమల, షేక్ మస్తాన్, జావీద్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

శిశువు మృతదేహానికి పరీక్షలు



శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రిలో సోమవారం పాతవర్నికి చెందిన సోని అనే మహిళకు డెలివరీ ఆలస్యం కావడంతో శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. శిశువును ఖననం చేసిన మరుసటి రోజు మంగళవారం కుటుంబ సభ్యులు బాన్సువాడలోని ఎంసీహెచ్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. శిశువు మృతికి కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగడంతో వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ కృష్ణ పూడ్చిపెట్టిన శిశువు మృతదేహాన్ని బయటకు తీయించి శవపరీక్ష చేశారు. వివిధ శాఖల అధికారుల సమక్షంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. శిశువు ఏ కారణంతో మృతిచెందిందో తెలుసుకోవడానికి మృతదేహాన్ని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తున్నామని, వైద్య పరీక్షలో వచ్చిన ఫలితాల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఉమ్మనీరు తాగడంతో పాటు పేగు మెడకు చుట్టుకోవడంతో శిశువు మృతి చెందినట్లు సూపరింటెండెంట్ విజయలక్ష్మి పేర్కొంటున్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన



బాన్సువాడ : బాన్సువాడ ఫిల్టర్ బెడ్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ సందర్శించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాగునీరు రంగు మారడంతో ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి నీళ్ల రంగు మారడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఫిల్టర్ చేసిన నీటినే పట్టణానికి సరఫరా చేయాలన్నారు. మెయిన్ రోడ్డు, కల్కి చెరువు వద్ద కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. మూడో వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇంటిని పరిశీలించి బాధితులను తాత్కాలిక షెల్టర్‌కు పంపించారు. మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిలర్ నర్సగొండ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద సేవ అభినందనీయం



బాన్సువాడ : బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని మంగళవారం కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. తెలంగాణ హై కోర్టు లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శిక్షణ పొందినందున తగాదాల విషయంలో మధ్యవర్తిత్వం వహించాలని కోరారు. వలంటీర్లు రామకృష్ణరెడ్డి, సంతోష్ తదితరులున్నారు.

గాంధారిలో రోడ్ల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గుంతలుగా మారిన రోడ్లను మంగళవారం ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకట్రాం పరిశీలించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు రోడ్లను పరిశీలించి మరమ్మతులకు అంచనా వేయాలని ఆదేశించినట్లు కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజు, కామెల్లి బాల్‌రాజు తెలిపారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి నెహ్రూ చౌరస్తా నుంచి సుభాష్ రోడ్డు, పోచమ్మ గల్లీ తో ప్రాథమిక పాఠశాల నుంచి అజీజ్ టేలర్ వరకు రోడ్లను పరిశీలించినట్లు తెలిపారు. సుమారు మూడు కి.మీ పొడవు రోడ్డుకు అంచనా వేసి ఎమ్మెల్యేకు అందజేస్తామని ఏఈ తెలిపారు.